క్లుప్తంగా

రాష్ట్ర కార్యదర్శిగా విష్ణువర్ధన్‌రెడ్డి



జనగామ: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యదర్శిగా జనగామకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. బుధవారం హైదరాబాద్ రెడ్డి హాస్టల్ ఆడిటోరియంలో ఎన్నికలు జరిగిన అనంతరం విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. ఆయనను జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్‌రెడ్డి, హరిబాబు అభినందించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

రఘునాథపల్లి: రామరాయనిబంగ్లాలో నిర్మాణంలో ఉన్న దుర్గామాత ఆలయానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వారాల రమేష్ రూ 10,116 విరాళం అందజేశారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సర్పంచ్ బక్క యాదగిరికి విరాళం అందించారు. గ్రామ పెద్దలు సాదం కుమారస్వామి, సుదీర్, కనకరాజు, మెరుగు హరీష్ ఉన్నారు.

క్రీడాపోటీల నిర్వహణకు..

చిల్పూరు: మండలంలోని లింగంపల్లిలో నేటి నుంచి నిర్వహించనున్న లింగంపల్లి ప్రీమియర్ లీగ్ (ఎల్‌పీఎల్) పోటీలకు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు శ్రీరాములు రజితశ్రీనివాస్ రూ. 4 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఊరడి రాజు, బూస శ్రీను, శేఖర్ మాట్లాడుతూ పోటీల నిర్వహణకు దాతలుగా ముందుకు రావడం అభినందనీయమన్నారు.

ఆర్థికసాయం

చిల్పూరు: పల్లగుట్టకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు కన్నెబోయిన రాజు తల్లి లచ్చమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, గ్రామ అభివృద్ధి దాత, చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు దహనసంస్కారాల నిమిత్తం రూ. 5 వేల ఆర్థికసాయం బుధవారం అందజేశారు.

అంగన్‌వాడీ ఆయా కుటుంబానికి..

దేవరుప్పుల: మండలంలోని ముస్‌పహాడ్‌కు చెందిన అంగన్‌వాడీ ఆయా జోగు సోమ నర్సమ్మ మృతి చెందింది. కాగా, ఆ కుటుంబానికి దేవరుప్పుల క్లస్టర్ అంగన్‌వాడీ టీచర్లు బుధవారం ఆర్థికసాయం అందించారు. సూపర్‌వైజర్ అమర్నిషా, అంగన్‌వాడీ టీచర్లు గండిపెల్లి రామతార, భాగ్యమ్మ, శోభ పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి

నర్మెట: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ తేజావత్ గోవర్దన్ అన్నారు. మండలంలోని మచ్చుపహాడ్ రైతు వేదికలో సర్పంచ్ రామిని శివరాజ్‌తో కలిసి బుధవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేదిశగా పలు సంక్షేమ పథకాలను అరులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జెడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్, జెడ్పీ కోఆప్టెడ్ ఎండి గౌస్, ఎంపీటీసీ లలితా సోమ్లా ఉన్నారు.

ఎన్నిక

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని ఆరబిందో డిగ్రీ కళాశాలలో బీఆర్ఎస్వీ నాయకుడు మబ్బు ఉదయ్ ఆధ్వర్యంలో కళాశాల నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు ప్రణీత్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కళాశాల అధ్యక్షురాలుగా కె.సింధు, ఉపాధ్యక్షుడుగా ఎస్.రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.అనూష, సహాయ కార్యదర్శిగా వైష్ణవి, కార్యదర్శులుగా నవీన్, ఫణిరాజ్, శృతి, అంజలి తదితరులు ఎన్నికయ్యారు.

రిమాండ్

బచ్చన్నపేట: మండలంలోని బసిరెడ్డిపల్లిలో బండకింది నర్సింహులు మృతికి కారణమైన బండారి రాజయ్యను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు. బుధవారం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... రాజయ్య తన వ్యవసాయ బావి వద్ద అడవి పందుల నివారణ కోసం ఫెన్సింగ్ వైరుకు విద్యుత్ సరఫరా అమర్చాడు. పక్క వ్యవసాయ భూమి గల నర్సింహులు ఆ తీగలను తాకి అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, మృతుడి భార్య ఫిర్యాదు మేరకు రాజయ్యను రిమాండ్ చేశామన్నారు. ఈ విషయంపై తుది నిర్ణయం కోర్టు తేల్చనున్నట్లు ఎస్సై తెలిపారు.

గీతకార్మికుడికి గాయాలు

కొడకండ్ల: తాటిచెట్టు పై నుంచి పడి గీత కార్మికుడికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని పాకాలలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పల్లె మొగిలి తాటిచెట్టుపైకి ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జనగామ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

బోర్ మోటార్ల చోరీ

చిల్పూరు: మండలంలోని దేశాయితండా గ్రామానికి చెందిన భూక్య వెంకటేశ్వర్లు, భూక్య జక్యాలకు చెందిన బోర్ మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి ఎత్తుకెళ్లారు. రోజు మాదిరిగానే బుధవారం వ్యవసాయ బావివద్దకు వెళ్లి బోర్‌మోటార్ ఆన్ చేయగా నీరు రాకపోవడంతో వెళ్లి చూడగామోటార్లు కనిపించలేదు. వెంటనే స్థానికి ఎస్సై వినయ్‌కుమార్‌కు సమాచారం అందివ్వగా అక్కడకు చేరుకుని కేసునమోదు చేసుకున్నారు.

సాగునీటి కాల్వల పూడ్చివేత

- చోద్యం చూస్తున్న అధికారులు

లింగాలఘణపురం: కోట్లాది రూపాయలు వెచ్చించి సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి రిజర్వాయర్లతో బీడు బారిన పొలాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన కాల్వలను రియల్‌ఎస్టేట్ వ్యాపారులు తమ సొంత లాభాల కోసం కాల్వను పూడ్చి రోడ్లుగా చూపిస్తున్నారు. మండల కేంద్రంలోని పాత చెరువులకు వచ్చే కాల్వతో పాటు మరో కాల్వను ఇటీవల రియల్‌ఎస్టేట్ వ్యాపారులు తమ భూమికి అడ్డంగా ఉన్నాయని పూడ్చివేశారు. మండల కేంద్రానికి ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న కాల్వను పూడ్చినప్పటికి అటు రెవెన్యూ, ఇటు నీటి పారుదల శాఖ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడంలేదు. కాల్వలను తవ్వేటప్పుడే సదరు రైతులకు పరిహారం చెల్లించి తీయడం జరుగుతుంది. రైతులు తమ భూములను అమ్ముకోగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూమిలోకి నేరుగా వెళ్లేందుకు కాల్వ అడ్డంగా ఉందని పూడ్చివేసి రోడ్డు వేశారు. నెల్లుట్ల సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద ఒకచోట, రైస్‌మిల్లు సమీపంలో మరోచోట రియల్ ఎస్టేట్ వ్యాపారులు రెండు చోట్ల ఇదేవిధంగా పూడ్చి వేయడం జరిగింది. అదీ కూడా ప్రధాన రోడ్డుకు పక్కనే ఉండడం విశేషం.



పాత చెరువులోకి వచ్చే కాల్వను పూడ్చి రోడ్డుగా మార్చిన దృశ్యం

యథావిధిగా కాల్వను తీయాలి

ఇటీవలే కాల్వ పూడ్చివేత విషయం తమ దృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని పట్టాదారుకు తెలియజేశాం. ఒకటి రెండు రోజుల్లో పూడ్చిన కాల్వను యథావిధిగా తీయకపోతే కేసు నమోదు చేస్తాం.

\- రాజు, ఏఈ, నీటిపారుదల శాఖ



నెల్లుట్ల సబ్‌స్టేషన్ సమీపంలో పూడ్చిన కాల్వ

విద్యార్థులపై తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టాలి



మాట్లాడుతున్న డీఈఓ రాము

లింగాలఘణపురం: విద్యార్థులపై తల్లిదండ్రులు కూడా శ్రద్ధ పెట్టాలని డీఈఓ రాము అన్నారు. 'ప్రేరణ' కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల కోసం ఎంతో ఖర్చు పెడుతూ నాణ్యమైన విద్య అందిస్తున్న క్రమంలో తల్లిదండ్రులు కూడా కొంత బాధ్యతతో ఉండాలన్నారు. పరీక్షల సమయంలో మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శ్రీనివాసు, కమ్యూనిటీ మొబలైజింగ్ ఆఫీసర్ నర్సింహరావు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పుష్పకుమారి, కస్తూర్బాగాంధీ స్పెషల్ ఆఫీసర్ అరుణ, హెడ్మాస్టర్లు మల్లికార్జున్, పద్మ, నర్సింహులు, గణేష్ పలు సూచనలు చేశారు.

పోటీ పరీక్షలతో ప్రతిభ వెలికితీత



విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీపీ, తహసీల్దార్

దేవరుప్పుల: పోటీ పరీక్షలతోనే విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయొచ్చని ఎంపీపీ బస్వ సావిత్రి, తహసీల్దార్ ఎడ్ల రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన మార్గం ప్రేమలత మోమోరియల్ సహకారంతో ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి ఫైనల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. కాగా, మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్న మనీషా, హాసిని, అక్షయలను సన్మానించి జ్ఞాపికలు ఇచ్చి అభినందించారు. సర్పంచ్ బిల్లా అంజమ్మ, 'రస్పాండెంటు పాండుకృష్ణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయాకర్, సుందర్‌రామిరెడ్డి, రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్



దేవానాయక్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి దయాకర్‌రావు

పాలకుర్తి టౌన్/పాలకుర్తి: కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ అండగా ఉంటున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని, దేశంలో ఇలాంటి పార్టీ లేదని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని ఈరవెన్నుకు చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త చిన్నాల రమేష్ కొద్ది నెలల క్రితం ప్రమాదవశాత్తు మృతిచెందగా ఆయన భార్య మౌనికకు రూ.2 లక్షల బీమా చెక్కును మంత్రి అందజేశారు.

పరామర్శ..

పాలకుర్తి మాజీ జెడ్పీటీసీ గుగులోత్ పార్వతి భర్త మల్లంపల్లి మాజీ సర్పంచ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుగులోత్ దేవానాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. దేవానాయక్ మృతదేహం వద్ద మంత్రి దయాకర్‌రావు పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. దేవాతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకొని కంటతడి పెట్టారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మండలంలోని అయ్యంగారిపల్లిలో ముస్కు కమలాకర్, మహేందర్, చిరంజీవిల తండ్రి సోమయ్య, పాలకుర్తిలో జిట్టబోయిన యాకయ్య తండ్రి మల్లయ్య, బోనగిరి రంగయ్య భార్య ఇటీవల మృతి చెందగా మంత్రి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. పాలకుర్తికి చెందిన గొట్టిముక్కుల సుధాకర్‌రెడ్డి ఇటీవల ప్రమాదానికి గురై చికిత్స పొందుతుండగా ఆయన ఇంటికి వెళ్లి మంత్రి పరామర్శించారు.

సేవాలాల్ గుడి నిర్మాణ స్థలాన్ని పరిశీలన..

పాలకుర్తి లో ఈనెల 26న శంకుస్థాపన చేయనున్న సేవాలాల్ మహారాజ్ గుడి నిర్మాణ స్థలాన్ని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరిశీలించారు. శంకుస్థాపన రోజున నిర్వహించనున్న భారీ కార్యక్రమాన్ని దృష్టిలోపెట్టుకొని పలు సూచనలు చేశారు. అనంతరం మండలంలోని తిరుమలగిరి దుర్గమ్మ ఉత్సవాలల్లో మంత్రి పాల్గొని దుర్గమాతకు పూజలు నిర్వహించారు.

పశువుల డాక్టర్‌ను నియమించాలి

- కలెక్టర్‌ను కోరిన నెల్లుట్ల వాసులు

లింగాలఘణపురం: మండల పరిధి నెల్లుట్ల గ్రామంలో పశువైద్యశాలకు వైద్యుడిని నియమించాలని గొర్రెలు, మేకల పెంపకందారులు కలెక్టర్ సీహెచ్.శివలింగయ్యను కోరారు. ఈ మేరకు బుధవారం పశువైద్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన జీవాలకు ఉచిత నట్టల నివారణ మందు కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించగా.. పలువురు సమస్యలు వివరించారు. మండలంలోనే నెల్లుట్ల పెద్ద జీపీ అని, జీవాలు ఎక్కువగా ఉన్న ఈ గ్రామంలో గతంలో ఉన్న వైద్యుడి పోస్టు రద్దు కావడంతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఉపాధి హామీ పథకంలో గొర్రెల షెడ్డు నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డీవీఏహెచ్ఓ ఎస్ఎల్.మనోహర్, ఏడీ నర్సయ్య, పశువైద్యులు అనిత, భగవాన్‌రెడ్డి, ఎల్ఎస్ఏ సరస్వతి, వీఏ కుమార్, నాగరాజు, దాల్‌సింగ్ నాయక్ పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు తప్పని సరి

నర్మెట: జీవాలకు కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తప్పనిసరి వేయించాలని అన్నారు. మండలంలోని మచ్చుపహాడ్‌లో సర్పంచ్ రామిని శివరాజ్‌తో కలిసి బుధవారం శిబిరాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడారు. ఈసందర్భంగా 2 వేల జీవాలకు మందును పంపిణీ చేశారు. ఎంపీటీసి లలితా, సిబ్బంది శివనాగరాజు, ఉపసర్పంచ్ రాజు, రైతులు పాల్గొన్నారు.



గొర్రెలకు నట్టల నివారణ మందు వేస్తున్న కలెక్టర్

స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు, ఉపాధ్యాయులు

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి చదువుతున్న 60 మంది విద్యార్థులకు మహాత్మా హెల్పింగ్ హ్యాండ్ వ్యవస్థాపక అధ్యక్షుడు గంటా రవీందర్ స్టడీ మెటీరియల్‌ను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టడీ మెటీరియల్‌ను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవడంతో పాటు వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు ఎండి పర్వేజ్, ఉపాధ్యాయులు పర్వేజ్, వెంకటేశ్వర్లు, రమేష్‌బాబు, చంద్రమోహన్, రవి, ప్రభాకర్, స్వరూపరాణి, రాజేందర్, అనిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మహాసభలను విజయవంతం చేయాలి



జనగామ రూరల్: అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మిద్దెపాక ఎల్లయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జిల్లా అధ్యక్షుడు కన్నారపు శివశంకర్ ఆధ్వర్యంలో మహాసభల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ మార్చి 5వ తేదీన హైదరాబాద్ కోఠిలోని తెలంగాణ సారస్వత్ పరిషత్‌లో మహాసభలు ఉంటాయని తెలిపారు. నాయకులు రవికుమార్, ఆనంద్, శ్రీనివాస్, శివశంకర్, సునీల్ పాల్గొన్నారు.

'పల్లా'ను కలిసిన గౌడ సంఘం నాయకులు

చిల్పూరు: మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే సురమాంభదేవి-కంఠమహేశ్వరస్వామి ఉత్సవాలకు హాజరు కావాలని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని బుధవారం నిర్వాహకులు కలిసి ఆహ్వాన పత్రాలను అందజేశారు.

పేదల సంక్షేమానికి కృషి

పాలకుర్తి టౌన్: బీజేపీ పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందని ఆ పార్టీ వల్మిడి, ముత్తారం గ్రామ శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ దుంపల సంపత్ అన్నారు. బుధవారం మండలంలోన వల్మిడి, ముత్తారంలో జరిగిన ప్రజాగోస-బీజేపీ భోరసా కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మహేందర్, కోటేశ్వర్, శ్రీకాంత్, రవి, సోమేశ్వర్ పాల్గొన్నారు.

తాగునీటిపై దృష్టి సారించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: రానున్న వేసవి కాలం దృష్ట్యా గ్రామంలో తాగునీటి విషయమై ప్రత్యేక దృష్టి సారించి పంచాయతీ అధికారులు, సిబ్బంది పనిచేయాలని వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన సర్పంచ్, వైస్ ఎంపీపీ దంపతులు చల్లా ఉమాసుధీర్‌రెడ్డి 45 రోజుల అమెరికా పర్యటనను ముగించుకుని తిరిగి రాగా గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల వారు బుధవారం స్వాగతం పలికారు.

ఘనంగా స్వయంపరిపాలన దినోత్సవం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లి ఎంపీపీఎస్‌లో బుధవారం స్వయంపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల హెచ్‌ఎం ఎండీ.తహసీన్ మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను, ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ లీల, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

కూనూర్ పాఠశాలలో..

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వయంపరిపాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలతో పాఠశాలకు హాజరైతోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పర్వేజ్, సురేందర్‌రెడ్డి, సంధ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

చిల్పూరు: కాకతీయుల కాలంలో నిర్మించిన శివాలయం అభివృద్ధి పనులను దాతల సాయంతో చేపట్టినట్లు ఆలయ చైర్మన్, మాజీ సర్పంచ్ సాదం వెంకటయ్య తెలిపారు. మండలంలోని కృష్ణాజీగూడెంలో దాతల సాయంతో శివాలయం చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులకు అర్చకుడు నర్సింగోజు బ్రహ్మచారి వేద మంత్రాల నడుమ చైర్మన్‌తో పాటు ఎంపీటీసీ సాదం నర్సింహులు శంకుస్థాపన చేశారు. పుట్ట కిరన్‌రెడ్డి, దొంత బాలరాజు, పోలు వెంకట్, పుట్ట బాపురెడ్డి ఉన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం



తరిగొప్పుల: వరంగల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట పవన్‌పై బీఆర్ఎస్ కార్యకర్తల దాడిని ఖండిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి ఆదేశానుసారం బుధవారం మండలకేంద్రంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహేష్, అర్జున్, ఉషా కిరణ్, పవన్, శ్రీనివాస్, సమ్మయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

పాలకుర్తి టౌన్: వరంగల్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాదయాత్రలో యూత్ కాంగ్రెస్ నాయకుడు తోట పవన్‌పై బీఆర్ఎస్ పార్టీ నాయకుల దాడికి నిరసనగా బుధవారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో బీఆర్ఎస్ ప్రభుత్వ దిష్టబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భగా యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు ధరావత్ రాజేష్‌నాయక్ మాట్లాడుతూ గుండాలకు, రౌడీలకు అడ్డాగా బీఆర్ఎస్ పార్టీ మారిందని అన్నారు. నాయకులు మహేష్‌గౌడ్, యాకస్వామి, హరికృష్ణ, భార్గవ్, శ్రీను, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భూ సర్వే



జనగామ రూరల్: మండలంలోని పెంబర్తిలోని సర్వే నంబర్ 482, 483లో 2 ఎకరాల 14 గుంటల భూమి ఆక్రమణకు గురవుతుదని మజీద్ కమిటీ సభ్యులు ఇటీవల కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందించి సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా, బుధవారం మండల సర్వేయర్ రాణాప్రతాప్, వక్ఫ్‌బోర్డు సర్వేయర్ సుజాతుల్లాఖాన్ జాయింట్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మహమ్మద్ యాకూబ్ పాషా మాట్లాడుతూ ప్రతి మండలంలో ముస్లింలకు స్మశానవాటికను, సఫర్ వహనాన్ని మంజూరు చేయాలని కోరారు. రహెమాన్, నూరొద్దీన్, ఇబ్రహీం, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవపై అవగాహన పెంచుకోవాలి

దేవరుప్పుల: విద్యార్థి దశ నుంచే సమాజ సేవ పట్ల అవగాహన పెంచుకోవాలని కరస్పాండెంటు బ్రదర్ జేసురాజు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని బాలయేసు ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌లో నేషనల్ ఫౌండేషన్ ఫర్ కమ్యూనల్ హార్మోనీ ఆర్గనైజేషన్ విత్ మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ గవర్నమెంటు ఆఫ్ ఇండియాకు విద్యార్థులు విరాళంగా వసూలు చేసిన రూ.70,054 చెక్కును పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. విద్యార్థుల దాతృత్వాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవి, భాస్కర్, మదన్‌మోహన్, విజయలక్ష్మి, మహేష్, జిమ్మీ, ఖాజా, పీఈటీ మధుతోపాటు తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న విద్యార్థులు

'ఇళ్ల పంపిణీలో గోల్‌మాల్'

నర్మెట: మండలంలోని వెల్దండలో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్ల పంపిణీలో అవకతవకలు జరిగాయని.. తక్షణం విచారణ జరింపించాలని కోరుతూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీఓ మధుమోహన్‌కు గ్రామస్తులు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా కమిటీ సభ్యులు బెల్లంకొండ వెంకటేష్, చుంచు విజేందర్ మాట్లాడుతూ మూడేళ్ల క్రితం వెల్దండలో 50 డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రభుత్వం నిర్మించిందన్నారు. పంపిణీ చేయాలని పలుమార్లు అధికారులు ప్రయత్నాలు చేసినా అవకతవకలు చోటుచేసుకోవడంతో అర్హులైన పేదలు అడ్డుకున్నారని అన్నారు. నిబంధనలు ఉల్లంఘించి భూములు, ట్రాక్టర్లు, వ్యవసాయ భూములు కలిగి ఉన్నవారికే తిరిగి ఇళ్ల కేటాయింపు జరిగిందని, తక్షణం విచారణ చేపట్టి వారిని తొలగించి అర్హులైన వారికి కేటాయించాలన్నారు. లేనిచో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.



ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ముగిసిన జూట్ బ్యాగుల శిక్షణ



సర్టిఫికెట్లు ఇస్తున్న అతిథులు

లింగాలఘణపురం: మండల కేంద్రంలో 45 రోజుల పాటు ఎంఎస్ఎంఈ (మినిస్ట్రీ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజ్యూస్) ఆధ్వర్యంలో జరిగిన జూట్ బ్యాగుల శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ దశరథ, సర్పంచ్ విజయ్‌మనోహర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు ఇచ్చారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జూట్ బ్యాగులను ఇంటి వద్దనే తయారీ చేసి ఉపాధి పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ నవీన్‌బాబు, ఫీల్డ్ ఆఫీసర్ వీరాంజనేయులు మాట్లాడుతూ వనిత యోజనా అభివృద్ధి కార్యక్రమంలో రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో సార్ప్ ఎన్‌జీఓ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, శిక్షకులు నాగదేవి, సుందరయ్య, చారీ పాల్గొన్నారు.

టోల్‌ప్లాజాలో ఉద్యోగి మృతి

- రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని సీఐటీయూ డిమాండ్

రఘునాథపల్లి: మండలంలోని కోమళ్ల టోల్‌ప్లాజాలో ఐటీ ఇంజనీర్ ప్రాజెక్టు మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం చిన్నవంగర గ్రామానికి చెందిన జలగం ప్రసాదరావు (41) మంగళవారం అస్వస్థతకు గురై మృతిచెందాడు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలోని మార్చురీ వద్ద మృతుడి కుటుంబ సభ్యులను సీఐటీయూ నాయకులు పరామర్శించి ఓదార్చారు. టోల్‌ప్లాజా యజమాన్యం రూ.25 లక్షల పరిహారం, మృతుడి భార్యకు ఉద్యోగం ఇవ్వాలని ఆందోళనకు దిగారు. సమాచారం తెలుసుకున్న సీఐ సంతోష్ ఆందోళన వద్దకు చేరుకొని టోల్‌ప్లాజా యజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడారు. ఇందుకు దహన సంస్కరణలకు రూ.లక్ష ఇస్తామని, రెండు రోజుల తర్వాత వచ్చి కుటుంబానికి న్యాయం జరిగేలా ఆదుకుంటామని టోల్‌ప్లాజా బాధ్యులు భరోసా ఇవ్వడంతో సీఐటీయూ నాయకులు ఆందోళన విరమించారు. ఆ తర్వాత అంబులెన్స్‌లో మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. కార్యక్రమంలో వెల్ది సర్పంచ్ కొయ్యడ మల్లేష్, నాయకులు సుంచ విజేందర్, గంగాపురం మహేందర్, జోగు ప్రకాష్, అజ్మీర సురేష్, జలగం ప్రసాదరావు పాల్గొన్నారు.



మృతదేహాన్ని గ్రామానికి తరలిస్తున్న సీఐటీయూ నాయకులు

అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దేవరుప్పుల: మండల కేంద్రంలోని చౌరస్తాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన పనులను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి దయాకర్‌రావు సహకారంతో విగ్రహ ప్రతిష్ఠాపన ప్రతిష్ఠాత్మకంగా జరిగేలా అన్ని వర్గాల ప్రజలతోపాటు నిర్వాహకులు తోడ్పాటు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ భిక్షపతి, మాజీ ఏఎంసి డైరెక్టర్ జోగు సోమనర్సయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మాచర్ల బాబు, బాషిపాక యాదగిరి, నరసింహ, సోమనర్సయ్య, ఐలయ్య, యాదగిరి, అంజయ్య, పరుశరాములు, ఎల్లేష్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

చిల్పూరుగుట్ట ఆలయ ఇన్‌చార్జ్ ఈఓగా వెంకట్రావు



చిల్పూరు: మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయ ఇన్‌చార్జ్ ఈఓగా నెక్కంటి వెంకట్రావు బుధవారం బాధ్యతలను చేపట్టారు. ఉదయం ఆలయాని చేరుకోగానే ఆలయ అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచర్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాలనడుమ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనంతరం చైర్మన్ ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి మార్చి 5వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలపై చర్చించారు. సిబ్బంది, ధర్మకర్తలు పాల్గొన్నారు.